క్లుప్తంగా

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్



సైక్లింగ్ చేసుకుంటూ వచ్చిన వారిని అభినందిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేటకమాన్: నిత్యం వాకింగ్, రన్నింగ్, యోగా, సైక్లింగ్, స్విమ్మింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. 200 కిలోమీటర్లు సైక్లింగ్ చేస్తూ సికింద్రాబాద్ నుంచి సిద్దిపేటకు వచ్చిన జ్ఞానేశ్వర్‌రావు, తిరుపతిరెడ్డికి పోలీసు కమిషనర్ కార్యాలయం వద్ద సీఐ విద్యాసాగర్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు రెండు కిలోమీటర్ల లోపు పనులు ఉంటే నడుచుకుంటూ వెళ్లాలని, ఐదు కిలోమీటర్ల వరకు సైకిల్ అలవాటు చేసుకోవాలని సూచించారు.

గంజాయి మత్తులో గ్రామ యువత



గంజాయి పీల్చడానికి తయారు చేసిన బాటిల్

అక్కన్నపేట(హుస్నాబాద్): గంజాయిని హుక్కాలా పీల్చేందుకు తయారు చేసిన ప్లాస్టిక్ బాటిల్ అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలోని గోదాం పక్కనే లభ్యంకావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. బాటిల్ మధ్యలో రంధ్రం చేసి గంజాయి పొగ నింపి స్ట్రాతో పీల్చేలా తయారు చేశారు. కొంతమంది యువకులు చాటుగా దీన్ని ఉపయోగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలోని ఓ కిరాణ దుకాణంలో విక్రయిస్తున్నట్లు సమాచారం. పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు దృష్టిసారించకపోవడంతో గ్రామంలో గంజాయి గుప్పుమంటోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



నియామక పత్రం అందజేస్తున్న వెంకట రామిరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నంగునూరులో ప్రత్యేక సమావేశం నిర్వహించి మండల నూతన కమిటీని నియమించారు. ఉపాధ్యక్షులుగా సతీష్‌గౌడ్, రాజు, రాజలింగం, లక్ష్మణ్, ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శులుగా సురేందర్ రెడ్డి, కరుణాకర్, సతీష్, కార్యదర్శులుగా కిషోర్, రమేశ్, రవి, రాజశేఖర్, కోశాధికారిగా రమేశ్, బీజేవైఎం మండలాధ్యక్షుడిగా దీపక్‌గౌడ్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా రత్నాకర్‌రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా జ్యోతిరెడ్డి ఎన్నికయ్యారు.

విజేతలకు నగదు బహుమతి



నగదు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గజ్వేల్: మహా శివరాత్రి సందర్భంగా గజ్వేల్ మండలం రిమ్మనగూడలో గ్రామ స్పోర్ట్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన జగదేవ్‌పూర్ మండలం రాయవరం జట్టుకు రూ.4 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన రిమ్మనగూడ జట్టుకు రూ.2 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన దాతర్‌పల్లి గ్రామ జట్టుకు రూ.వెయ్యి నగదు బహుమతి అందజేశారు.

మట్టి తరలింపు అడ్డగింత

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని జమ్మికుంటలో ఆదివారం కొంతమంది ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా తరలిస్తుండగా ఇరిగేషన్ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ సంతోష్ మాట్లాడుతూ జమ్మికుంట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నరనే విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేపట్టి తరలింపును అడ్డుకున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా చెరువు, కుంటల నుంచి మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బోధించేదెలా.. చదివించేదెలా

- ఒక్కో పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు
- ఒకే గదిలో ఐదు తరగతుల నిర్వహణ
- ఒత్తిడికి గురవుతూ బోధన
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ఒకే పాఠశాల, ఒక్కటే తరగతి గది. ఇందులో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని తరగతులకు బోధించేది ఒకే ఒక ఉపాధ్యాయుడు. మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలో ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. సరైన బోధన అందకపోవడంతో తమ పిల్లలు ప్రయోజకులు కావాలని పాఠశాలలకు పంపే తల్లిదండ్రుల ఆశయానికి గండిపడుతోంది. విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తామని చెబుతున్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఒకే గదిలో 5 తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని లింగుపల్లి, మిరుదొడ్డిలోని బీసీ కాలనీ, ఆరెపల్లి, కొండాపూర్‌తో పాటు అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని అక్బర్‌పేట, బేగంపేట, గుర్రాలపల్లి ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలకు ఏకోపాధ్యాయులను ప్రభుత్వం నియమించింది. వీరు 5 తరగతుల విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారు. ఒక గదిలో 35 నుంచి 50 మంది విద్యార్థులుంటారు. ఒక తరగతికి నాలుగు సబ్జెక్టుల చొప్పున 20 పాఠాలు బోధించాలి. విద్యార్థులు ఏం వింటున్నారో ఏం చదువుతున్నారో తెలియని పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుడు పాఠశాలకు రాకపోతే ఆరోజు అప్రకటిత సెలవుగా భావిస్తారు. ఇక ప్రైవేటు పాఠశాలల తాకిడికి సర్కార్ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. కొండాపూర్ ఎస్సీ కాలనీ, అల్వాల గ్రామ పంచాయతీ మధిర గ్రామం రాంనగర్, ధర్మారం ఎస్సీ కాలనీలో విద్యార్థులు లేక పాఠశాలలు మూతపడ్డాయి. ఆర్థిక స్తోమత లేక తమ పిల్లలను సర్కార్ బడులకు పంపిస్తున్నామని, అవి మూతపడటంతో తమ పిల్లల పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కొంచెం ఆర్థిక స్తోమత కలిగిన తల్లిదండ్రులు



మిరుదొడ్డి బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల

ఎక్కువ శాతం ప్రైవేటు పాఠశాలలవైపే మొగ్గు చూపుతున్నారు.

ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కరువు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకనే విద్యారంగం నిర్వీర్యం అవుతోంది. ప్రాథమిక స్థాయిలో మెరుగైన విద్యను అందించలేకపోతున్నాయి. ఉపాధ్యాయులు లేకపోతే విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. విద్యారంగానికి పెద్దపీటవేస్తామనే ప్రభుత్వం ఆచరణలో చూపించాలి. ఏకోపాధ్యాయ విద్యా బోధనకు స్వస్తి చెప్పాలి.

– పి.శంకర్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి

విద్యార్థులు లేకనే ఏకోపాధ్యాయుల నియామకం



ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేకనే ఏకోపాధ్యాయులను నియమించాం. విద్యార్థుల సంఖ్య పెరిగితే అదనంగా ఉపాధ్యాయులను నియమిస్తాం. విద్యార్థుల సంఖ్య పెంచడానికి చర్యలు చేపడతాం. ఇందుకు గ్రామస్తుల సహకారం తీసుకుంటాం.

– జోగు ప్రభుదాస్, ఎంఈఓ, మిరుదొడ్డి

ఆరు గ్యారంటీలతో ప్రజలు ఖుషీ

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, రాష్ట్రంలో ప్రజల పాలన కొనసాగుతోందని సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్నగుండవెల్లి గ్రామంలో పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరేందుకు నాయకులు ఉత్సాహం చూపుతున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు గుర్రం అంజిరెడ్డి, మహిపాల్ రెడ్డి రాముల, వెంకట్, పద్మా రెడ్డి, గ్రామ అధ్యక్షుడు మల్లారెడ్డి, పుల్లూరు ఆలయ చైర్మన్ కనకయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పూజల హరికృష్ణ

బీజేపీ అధ్యక్షుల నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లాలోని వివిధ మండలాలకు బీజేపీ అధ్యక్షులను నియమిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ మున్సిపాల్టీ అధ్యక్షుడిగా దేవులపల్లి మనోహర్, జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడిగా మంద ఐలయ్య, కొండపాక మండల అధ్యక్షుడిగా నీల సత్యం, కుకునూర్‌పల్లి మండల అధ్యక్షుడిగా సంపత్ రెడ్డి, ములుగు మండల అధ్యక్షుడిగా మన్నె శ్రీనివాస్, మర్కుక్ మండల అధ్యక్షుడిగా రాంరెడ్డిలను నియమించినట్లు పేర్కొన్నారు.

ఆదమరిస్తే అంతే..



పగిలిన మురుగు కాలువ స్లాబు

మిరుదొడ్డి(దుబ్బాక): మురుగు కాలువలపైఉన్న స్లాబులు పగిలిపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని పలువార్డుల్లో మురుగు కాలువల స్లాబులు పగిలిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈదారి గుండా వెళ్లాలంటే జంకుతున్నారు. రాత్రివేళలో ఆదమరిస్తే ప్రమాదాలు తప్పవని ఆయా కాలనీలవాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేక పాలనాధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



ధూళ్మిట్ట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు



గోనెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

మద్దూరు(హుస్నాబాద్): ధూళ్మిట్ట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్ శర్మ, రామలింగం, పాపిరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సన్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04 సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

ఆర్థిక బాధలు తాళలేక ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): ఆర్థిక బాధలు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం కుటుంబ సభ్యులు, భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి గ్రామానికి చెందిన ఎమ్మ భూపాల్ (36) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య బాల్‌లక్ష్మి, కూతురు అక్షయ, కుమారుడు సందీప్, చెల్లెలు సుజాత ఉన్నారు. నాలుగేళ్ల క్రితం జీవనోపాధి కోసం అప్పులు చేసి ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. రెండేళ్లుగా ట్రాక్టర్ పనులు నడవకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయాయి. వీటికి తోపాటు ఆర్థిక పరమైన ఇబ్బందులతో సతమతమయ్యేవాడు. చెల్లెలు వివాహం, పిల్లల భవిష్యత్‌పై నిత్యం మదన పడేవాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తి చెందిన భూపాల్ ఈనెల 6వ తేదీ సాయంత్రం అక్బర్‌పేటలోని వికాస్ స్కూల్ సమీపంలో ఎలుకల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస వదిలాడు. మృతుడి భార్య బాల్‌లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



భూపాల్ (ఫైల్)

సైకిల్‌పై నుంచి పడి రైతు మృతి

దుబ్బాకరూరల్: సైకిల్‌పై నుంచి కిందపడి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామంలో జరిగింది. ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం దాకుల స్వామి(53) సైకిల్‌పై పొలానికి వెళ్లొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తూ టీ తాగేందుకు గ్రామంలోని హోటల్ వద్ద సైకిల్‌పై నుంచి దిగుతూ కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



చిన్నకోడూరులో సావిత్రి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



హుస్నాబాద్‌లో నివాళులర్పిస్తున్న మిత్రమండలి సభ్యులు

సావిత్రి బాయి పూలే ఆదర్శం

చిన్నకోడూరు(సిద్దిపేట): సావిత్రి బాయి పూలే జీవితం ఆదర్శమని నాయకులు కొనియాడారు. ఆమె వర్ధంతిని ఆదివారం చిన్నకోడూరులో నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాపయ్య, ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జంగిటి శ్రీనివాస్, ఎంపీటీసీ శారద, నాయకులు తదితరులు పాల్గొన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో సావిత్రి భాయి పూలే వర్ధంతి నిర్వహించారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సావిత్రి బాయి పూలే వర్ధంతిని ఆదివారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డేవిడ్, రోహిత్, హరిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మిత్రమండలి 87 ఆధ్వర్యంలో ఆదివారం సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. సావిత్రిబాయి పూలేను బాలికలు స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మిత్రమండలి 87 అధ్యక్షుడు బూట్ల రాజమల్లయ్య, ప్రధాన కార్యదర్శి దొడ్డి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): సావిత్రి బాయి పూలే వర్ధంతిని ఆదివారం బీఎస్పీ, స్వేరోస్ నాయకులు నిర్వహించారు. బెజ్జంకిలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు బాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మగ్గం వర్కు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవి రవీందర్

కొండపాక(గజ్వేల్): మహిళలు మగ్గం వర్కు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు మగ్గం వర్కు శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ఉపాధి మార్గాలు చూపాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనకవ్వ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఐలయ్య, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సీసీ యాకుబ్, వీఓ లీడర్లు బాల్‌లక్ష్మి, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రాజలింగం, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



లకుడారంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉపాధ్యక్షుడు దే రవీందర్

పార్థివేశ్వర ఆలయంలో మైనంపల్లి పూజలు

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పార్థివేశ్వర ఆలయాన్ని ఆదివారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డితో కలిసి సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలను తిలకించి ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఆయన వెంట టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

గజ్వేల్ సీఐ సైదా

గజ్వేల్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం కీలకమని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో కలియతిరిగి సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించారు. విశ్రాంత జవాను కామేపల్లి వెంకట నర్సింహారావు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారమందించారని చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు సహకరించాలని కోరారు. అనుమానాస్పద, అపరిచితుల సమాచారం తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శంకర్, గ్రామ నాయకులు శ్రీనివాసరావు, నల్ల రాము, వెంకట్‌గౌడ్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



రిమ్మనగూడలో చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న గజ్వేల్ సీఐ సైదా

కొమ్మూరి వ్యవహారంపై విచారణ జరిపించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్

కొమురవెల్లి(సిద్దిపేట): మహా శివరాత్రినాడు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి దేవస్థానం అతిథి గృహంలో నడిపిన వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పండగనాడు ఆలయానికి సమీపంలోని చేర్యాలలో కాకుండా ఆలయంలోని అతిథి గృహంలో బసచేయడం ఎందుకని విమర్శించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తాడూరి భరత్, విక్రమ్, రాఘవ, అరవింద్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ అన్నారు. ఆదివారం సిద్దిపేట మున్సిపాల్టీలోని నర్సాపూర్‌లో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు, ఏటీఎం కార్డు వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. మూఢ నమ్మకాలు నమ్మొద్దని, చిన్నచిన్న తగాదాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

◆ మద్దూరులో సామాజిక తనిఖీ

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కనకమ్మ, డీఆర్పీ యాకుబ్, మాజీ సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ మర్మాముల గ్రామ గౌడ సంఘం కమిటీ ఎన్నిక

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని మర్మాముల గ్రామ గౌడ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉత్కం ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా సుందరగిరి బాలకిషన్, డైరెక్టర్స్‌గా సుందరగిరి సిద్ధిరాజయ్య, ఉట్కూరి వెంకట్‌గౌడ్, బత్తిని కనకయ్య ఎన్నికయ్యారు.

◆ మృతుడి కుటుంబానికి పరామర్శ

తొగుట(దుబ్బాక): మండల కేంద్రంలో అప్పుల బాధతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న చింత కుమార్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. రైతులు గుండె నిబ్బరంతో బతకాలన్నారు. మృతుడి పిల్లల చదువు బాధ్యత తాను తీసుకుంటానని వారికి హామీనిచ్చారు. ఆయన వెంట తొగుట మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, నాయకులు తిరుపతి, నిరంజన్, శ్రీనాకర్‌రెడి, యాదగిరి, కనకయ్య ఉన్నారు.

◆ గది నిర్మాణానికి విరాళం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లె సమ్మక్క సారలమ్మ జాతర జరిగే ప్రాంతంలో వసతుల ఏర్పాటు కోసం రావుల రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం రూ.1.50 లక్షలు విరాళంగా అందజేశారు. అనంతరం గది నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే సమ్మక్క జాతర నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో కమాన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు.

◆ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా రాజిరెడ్డి



తొగుట(దుబ్బాక): మండలంలోని గణపురం గ్రామంలో రెడ్డి సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా ఉప్పల రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పుల్లగూర్ల రాజిరెడ్డి, కార్యదర్శిగా బాపురెడ్డి, కోశాధికారిగా పుల్లగూర్ల బాపురెడ్డితో పాటు పలువురు సలహాదారులు, కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

◆ నూతన కార్యవర్గం ఎన్నిక

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణ వడ్రంగి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకోజి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బెజ్జంకి రాజు, ప్రధాన కార్యదర్శిగా వంశీకృష్ణ, కోశాధికారిగా సప్తగిరి, కార్యవర్గ సభ్యులుగా నర్సింహాచారి, చారి, సురేష్, నరేంద్ర సాయి, సంతోష్ కుమార్ ఎన్నికయ్యారు.

◆ కేంద్రంలో మళ్లీ మోదీ ప్రభుత్వమే

కోహెడరూరల్ (హుస్నాబాద్): బీజేపీ నేతృత్వంలో మోదీ ప్రభుత్వమే మళ్లీ వస్తుందని ఆ పార్టీ హుస్నాబాద్ అసెంబ్లీ ప్రభారీ గుజ్జ సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని తంగళ్లపల్లి కిష్టస్వామి గుట్టపై ఆదివారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే కేంద్ర మంత్రి అమిత్‌షా సభను విజయవంతం చేయాలన్నారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ను గెలిపించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, అసెంబ్లీ కో‌కన్వీనర్ వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.